


వడ్డన చేస్తున్న మేయర్ సునీల్ రావు



సంతోష్‌నగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

# కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు



కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌లో దుర్గామాత పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు , అన్నదాన కార్యక్రమం
- భక్తులతో కిటకిటలాడిన మండపాలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం నగరంలోని ఆలయాల్లో, మండపాల్లో దుర్గాదేవీకి ప్రత్యేక పూజలు, అలంకారాలు, అన్నదానాలు, అర్చనలు, అభిషేకాలతో పాటు హవనాలను నిర్వహించారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో కాళరాత్రి రూపంలో అమ్మవారికి లలితాదేవి పూజ చేసి గాజులతో విశేషాలంకారం చేశారు. సాయంత్రం లలితాసహస్రనామ పారాయణం నిర్వహించారు. అలాగే, యజ్ఞవరాహస్వామి క్షేత్రంలో ఉదయం మహాస్వతీ, లక్ష్మీహయగ్రీవ హవనం, సాయంత్రం చతుష్షష్టి పూజ నిర్వహించారు. 33వ డివిజన్‌లో ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని మేయర్ సునీల్‌రావు ప్రారంభించారు. సంతోష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫల పంచామృతాలతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో భక్తులు కోటేశ్వర్, శైలజ, గడ్డం సంజీవ్ కుమార్, సంధ్యారాణి దంపతులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 21: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. వేడుకల్లో ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వేణుమాధవరావు, వేముల రామచంద్రర్, బుర్ర రమేశ్ గౌడ్, రాజ్‌కమల్, శివ, గాజుల అంజన్న, రవి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మొగ్దుంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీ మండపంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి లక్ష్మి-శ్రీనివాస్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భవానీ దీక్షాపరులతో కలిసి చండీ హోమం చేశారు.



బాలసదనంలో బతుకమ్మ ఆడుతున్న అధికారులు, చిన్నారులు



కరీంనగర్ డిపో-2 ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

# ఘనంగా బతుకమ్మ సంబురాలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: క్రిస్టియన్ కాలనీలోని బాలసదనంలో శనివారం సాయంత్రం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సద్దుల బతుకమ్మ సంబురాలను పిల్లలతో కలిసి ఘనంగా జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంత, డీసీసీహెచ్ ఎల్ సంపత్, బాలసదనం సూపరింటెండెంట్ సంతోషి, బాలల సంక్షేమ సమితి సభ్యులు రాధ, శేఖర్, అర్చన, విజయ్, శిశు గృహ మేనేజర్ తేజశ్విని, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ పుష్పలత, టీం సాయికిరణ్, మహేశ్ ప్రియాంక, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణచౌక్, అక్టోబర్ 21: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గల డిపో-2లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన మహిళా సిబ్బంది బతుకమ్మ పాటలతో పాటు కోలాట ప్రదర్శనలు, దాండియా ఆడారు వేడుకల్లో డిపో-2 మేనేజర్ మల్లేశం, అధికారులు నాగమణి, కమల, సుచరిత, లతిత, ఉమాదేవి, సునీత, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# పంపిణీ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు

- ఏర్పాట్లు పరిశీలించిన డీఈవో, కలెక్టర్ డాక్టర్ బీ గోపి



కంట్రోల్ యూనిట్ వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఈవో, కలెక్టర్ డాక్టర్ బీ గోపి

కలెక్టరేట్, అక్టోబర్ 21: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పంపిణీ కేంద్రాలకు శనివారం ఈవీఎంలు తరలించారు. కలెక్టరేట్ పరిసరాల్లో గల ఈవీఎంల గోదాం నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు పటిష్టమైన భద్రత నడుమ తరలింపు ప్రక్రియ కొనసాగించారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ తాళాలు తెరిచిన ఎన్నికల యంత్రాంగం ఆయా కేంద్రాలకు పంపిణీ చేసే ఏర్పాట్లు పరిశీలించింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి మాట్లాడుతూ, ఆన్‌లైన్ ద్వారా మొదటి విడుత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. అనంతరం నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూముల్లో వీటిని భద్రపరిచారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అబ్జర్వర్ పర్యవేక్షణలో రెండో ర్యాండమైజేషన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు నాంపల్లి శ్రీనివాస్, ముడుపు మోహనచారి, ఎస్ శ్రీనివాస్, అనిల్‌కుమార్, అబ్బాస్ షమీ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సద్దుల బతుకమ్మ

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: ఈనెల 22న సద్దుల బతుకమ్మ, 23న దసరా, 24ను దుర్గామాత నిమజ్జనం జరుపుకోవాలని నగర వైదిక పురోహితులు మంగళంపల్లి శ్రీనివాస శర్మ, నమిలకొండ రమణాచార్యులు తెలిపారని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రావు, గోరక్షా శ్రీ బాగ్ ప్రముఖ్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, విద్యాసాగర్, రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలు పండుగలను జరుపుకోవాలని తెలిపారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం



మహేశ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు, కుటుంబసభ్యులు

గంగాధర, అక్టోబర్ 21: గంగాధర పోలీస్ స్టేషన్‌లో శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ముందు ఉన్న పోలీస్ అమరుడు గుజ్జెటి మహేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మహేశ్ కుటుంబసభ్యులు సన్మానించారు. పోలీసు అమర వీరుల త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చొప్పదండి సీఐ రవీందర్, ఎస్ఐ పుల్ల అభిలాష్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముగిసిన అంతర్జాతీయ ఓపెన్ చదరంగ పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలు

కొత్తపల్లి, అక్టోబర్ 21: జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఐదు రోజులుగా జరిగిన మొదటి అంతర్జాతీయ ఓపెన్ చదరంగ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో 8.5 పాయింట్లు సాధించి 2139 రేటింగ్‌తో తెలంగాణకు చెందిన భరత్‌కుమార్‌రెడ్డి ప్రథమ స్థానం, ఏపీకి చెందిన మల్లేశ్వరరావు 8.0 పాయింట్లతో 1777 రేటింగ్ సాధించి రెండో స్థానం, తెలంగాణకు చెందిన కుమార్ 7.5 పాయింట్లతో 1432 రేటింగ్‌తో మూడో స్థానం సాధించారు. విజేతలకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి ట్రోఫీ, నగదు బహుమతులు అందజేశారు. ఆలిండియా స్థాయి మొదటి చదరంగ పోటీలను కరీంనగర్‌లో నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షుడు చిదుర సురేశ్, పోటీల కన్వీనర్ రాజేంద్రప్రసాద్, చీఫ్ ఆర్బీటర్లు ఆర్ చంద్రమౌళి, శ్రీరామ్, సృజయ్, గోపినాథ్, గోనే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- తెలంగాణ మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ ఆకుల వెంకటేశం

కలెక్టరేట్, అక్టోబర్ 21: ఆపద మొక్కుల వాగ్ధానాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని తెలంగాణ మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ ఆకుల వెంకటేశం పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కోతిరాంపూర్‌లోని ఫోరం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సకల సంపదలతో విలసిల్లుతున్న తెలంగాణను అన్ని రకాలుగా దోచుకుని, ద్రోహం చేసింది కాంగ్రెస్సేనన్నారు. సకల జనుల సమష్టి పోరాటాలతో తెచ్చుకున్న తెలంగాణపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్ తెలంగాణనిస్తే 2014 ఎన్నికల్లో ఆపార్టీని ప్రజలెందుకు ఆదరించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హక్కులపై రాహుల్‌గాంధీ ఏనాడు పార్లమెంటులో ప్రశ్నించలేదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ చేసిన తాత్సారంతోనే 1100కు పైగా తెలంగాణ ఉద్యమకారులు అమరులయ్యారని గుర్తు చేశారు. స్క్రిప్టు రీడర్‌గా మాత్రమే పనికొచ్చే ఆపార్టీ అగ్రనేత, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. అధికారం కోసం తహతహలాడుతున్న సోనియమ్మ బిడ్డ ప్రియాంకగాంధీ కుటుంబపాలనపై మాట్లాడడం విడ్డూరమన్నారు. డెబ్బై ఏండ్ల క్రితం రాహుల్, ప్రియాంకల తాత జవహర్‌లాల్‌నెహ్రూ ప్రారంభించిన ఎస్సారెస్పీ పనులు ఇంకా కొనసాగుతున్నాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో తెలంగాణ మేధావుల ఫోరం నాయకులు మంచికట్ల గోవర్ధన్, ఆకుల రాము, బెజ్జెంకి మధుసూదన్, రఘుపతి పాల్గొన్నారు.